## తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఉబుంటు టీం చేయూత

**వేద న్యూస్, గీసుకొండ :**



వరంగల్ జిల్లా, గీసుకొండ మండల కేంద్రానికి చెందిన వీరగొని కుమారస్వామి అనే నిరుపేద వ్యక్తి గత కొంత కాలంగా తీవ్ర గొంతు వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉబుంటు సేవా సంస్థ మానవత్వంతో స్పందించి, రూ. 5వేలు తక్షణసాయం పంపగా, అట్టి నగదును ఉబుంటు ప్రతినిధి, ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి బాధితుడికి అందజేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉబుంటు సేవా సంస్థ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేదరికం, అనారోగ్యం, విద్య అనే అంశాలకు సంబంధించి పలు సేవాకార్యక్రమాలు చేపట్టి సాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పారిశుద్ధ కార్మికురాలిపై కోతుల దాడి

**వేద న్యూస్, శివనగర్ :**



గ్రేటర్ వరంగల్ నగరంలోని 34 వ డివిజన్ శివనగర్‌లో పారిశుద్ధ కార్మికురాలు గన్నారపు తేజపై కోతులు దాడి చేయగా కార్మికురాలు తీవ్రంగా గాయపడింది. మంగళవారం గన్నారపు తేజ (50) ఉదయం తన విధులలో నిమగ్నమై ఉండగా ఆమెపై కోతులు దాడి చేసింది. ఈ దాడిలో ఎడమ చేయిపై తీవ్ర గాయం అయింది. దీంతో పరిగెత్తే క్రమంలో కింద పడటంతో మోకాళ్ళకు గాయాలయ్యాయి. స్పందించిన స్థానికుడు అమర్, మహేష్ 108కు సమాచారం అందించగా అంబులెన్సులో గాయపడిన పారిశుద్ధ కార్మికురాలను. జవాన్ సుమన్, మలేరియా వర్కర్ దేవేందర్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.



## ఘనంగా నల్లమోతు సిద్ధార్థ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

అడవిదేవులపల్లి మండల కేంద్రం నందు మిర్యాలగూడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నల్లమోతు సిద్ధార్ధ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు తినిపించి నల్లమోతు సిద్ధార్థ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడవిదేవులపల్లి మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు కొత్త మర్రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను నాయక్,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాబూజాని, మధు,సత్యం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు హాజరయ్యారు.



## నాణ్యమైన భోజనం అందించాలి

**న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం దేశరాజు పల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్, ప్రభుత్వ పాఠశాలను మంగళవారం రోజున మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు సందర్శించారు. అంగన్వాడి సెంటర్, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణ ఏ విధంగా ఉందో పరిశీలించడానికి స్వయంగా తాను విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ముఖ్యంగా అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

## ఖాకీ వనంలో కలుపు మొక్కలు..!

**మొదటి పేజీ తరువాయి**

పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో డబ్బులిచ్చి వస్తున్నారనే ప్రచారం జోరుగా జరుగుతున్నది. పోస్టింగ్ వచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఇస్తున్న డబ్బులను తిరిగి రాబట్టుకునేందుకు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. పోస్టింగుల కోసం ప్రజాప్రతినిధులు అప్రకటిత రేట్లు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారని, పోస్టింగుల కోసం బేరసారాలు జోరుగా చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఆ పనులకు సంపూర్ణంగా అడ్డుకట్ట పడినప్పుడే పోలీస్ శాఖలో పారదర్శకత పెరిగి.. అవినీతి క్రమంగా తగ్గుముఖం పడుతుందనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ప్రచారం

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట మండల కేంద్రంలో వరంగల్ నల్గొండ ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రచారంలో భాగంగా శాయంపేట బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్స్ ను కలిసి కరపత్రం అందించి టీచర్స్ ఎమ్మెల్సీలో బిజెపి బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పులి సరోత్తం రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో 36 సంవత్సరాల అనుభవం ఉంది 20 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ సంఘాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో సేవలందించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో టిటిజేఏసి బాధ్యతలు చేపట్టి సకల జనుల సమ్మెలో 32 రోజులు వేలాది ఉపాధ్యాయులతో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో కోర్టు కేసులు ఎదుర్కొన్నారు. సిపిఎస్ రద్దు జీవో 317, పిఆర్సి సహ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడారని గుర్తుచేశారు. అదేవిధంగా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటికొండ రవికిరణ్ మాట్లాడుతూ 100 రోజుల్లో 6 గ్యారంటీలో అమలు చేస్తాను ఉన్న హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత 14 నెలల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయక ప్రజలను మోసం చేసింది నియామకాలు చేపట్టక నిరుద్యోగులు ఉసురుపోసుకున్న గత టిఆర్ఎస్ పాలన బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తుందని ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ నీటి మీద రాత గానే మారిందని ఆరోపించారు. యువతకు నెలకు 4000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ బూటకమైందని మహిళలకు 2500 రూపాయలు ఆర్థిక సాయం పత్తా లేకుండా పోయిందని అన్నారు. నిర్ణీత గడువులోగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తామన్న హామీ మర్చిపోయారని 7500 కోట్ల ఫీజులు సిమెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, టీచర్స్ సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, బాసాని విద్యాసాగర్, ఉప్పు రాజు, ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర సందర్శనలు పాఠ్యప్రణాళికలో కీలకం

**వేద న్యూస్, హైదరాబాద్:**




విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా క్షేత్ర సందర్శనలు కూడా చేయాలని, అవి పాఠ్యప్రణాళికలో కీలకమని జాతీయ గణాంకాల సంచాలకులు పి.మనోహర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌లో జాతీయ గణాంకాల కార్యాలయం ఏర్పాటు చేసిన స్టాల్ ను చివరి రోజు సిటీ కాలేజి గణిత శాస్త్రం, గణాంకాల విభాగ విద్యార్థులు సందర్శించారు. డిగ్రీ, పిజి విద్యార్థులు 35 మంది, అధ్యాపకులు జయదేవ్ రాథోడ్, రుచిత, షణ్ముఖ రావు, మనోజ్, నయోమి ఆధ్వర్యంలో ఈ క్షేత్ర సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్ ఎస్ ఓ సంచాలలకులతో సహా ఇతర అధికారులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం లభించింది. ఎన్ఎస్ఓ నిర్వహిస్తున్న పనితీరును అధికారులు విద్యార్థులకు వివరించారు. అలాగే, (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ గురించి పరిచయం చేసి, గణాంకాలు, డేటా విశ్లేషణ రంగంలో అవకాశాలను అన్వేషించేందుకు ప్రోత్సహించారు. విద్యార్థులు ఎన్ఎస్ఓ స్టాల్‌లో నిర్వహించిన పజిల్స్, క్విజ్‌ల వంటి వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యకలాపాలు వారి విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించటమే కాకుండా, వినోదభరితంగా, ఆసక్తికరమైన అభ్యాస అనుభూతిని అందించాయి. సందర్శనలో పాల్గొన్న విద్యార్థులకు గుర్తుగా, ఎం ఎస్ ఓ స్టాల్ అధికారులు టీ-షర్టు, కీచైన్లు అందించారు.

ఈ ఫీల్డ్ ట్రిప్ తమకి ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ అందించడంతో పాటు, భవిష్యత్తులో గణాంక రంగంలో అవకాశాలను పరిగణించేందుకు ప్రోత్సహించిందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.

# నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- ఎస్పి కిరణ్ ఖరే

**వేద న్యూస్, భూపాలపల్లి :**



నేరాల నియంత్రణ కోసం పోలీసు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించి, పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో విచారణ, స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్పి సమీక్ష జరిపి, కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నేర స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు సంబంధించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేపట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధికారులంతా విజిబుల్ పోలీసింగ్ కి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ సందర్శనలు, పట్టణంలో వార్డుల సందర్శనలు పెంచాలన్నారు. స్థానికంగా వుండే ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని, మహిళల పట్ల నేరాలపై వేగంగా స్పందించి, న్యాయం చేయాలన్నారు. వివిధ దొంగతనాల కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు ఎస్పి గారు తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేసిన ఎస్పి, పలు ప్రమాదాలు జరిగిన చోటును హాట్ స్పాట్ గా గుర్తించి, వాటికీ గల కారణాలను తెలుసుకుని, అవసరమైతే ఇతర శాఖల సమన్వయం తో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆదనపు ఎస్పి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు వర్టికల్ డిఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# డ్రైన్ నిర్మాణానికి సహకరించండి

**వేద న్యూస్, వరంగల్:**



స్థానిక కాలనీవాసులు డ్రైన్ నిర్మాణానికి సహకరించాలని బల్ది యా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగర పరిధి లోని 42 వ డివిజన్ తెలంగాణ కాలనీలో డ్రైన్ ఏర్పాటుకు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మా ట్లాడుతూ స్థానిక ప్రజల యొక్క సౌకర్యార్థం డ్రైన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందుకోసం స్థానికుల తో పాటు సదరు యాజమాన్యం సహకరించాలని వారికి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ,ఇన్చార్జి సిపి రవీంద్ర రాడే కర్, ఈఈ శ్రీనివాస్, టి పి ఎస్ అనిల్ ,ఏఈ మోజామిల్, తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా

**వేద న్యూస్, వరంగల్:** భద్రకాళి అమ్మవారిని మంగళవారం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండే విధంగా భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

### జైళ్లశాఖ పెట్రోల్ బంకుల్లో నాణ్యత, స్వచ్ఛత, కచ్చితత్వం

**మొదటి పేజీ తరువాయి:** పేర్కొన్నారు. టీ.కళాసాగర్, పర్యవేక్షణ అధికారి కేంద్రకారాగారము, వరంగల్, మామునూరు జైలు నందు ఎన్నో రకముల స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమములు చేపడుతున్నామని అన్నారు. నూతనంగా ప్రారంభించబడుతున్న ఈ పెట్రోల్ బంకు నందు 8 మంది విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్, నితిన్ సేలుకర్, భారత్ పెట్రోలియం స్టేట్ హెడ్ (రిటైల్), తెలంగాణ తదితరులు హాజరయ్యారు.

## ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

**వేద న్యూస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని మైనార్టీ గురుకుల విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడాలని మైనార్టీ గురుకుల కోఆర్డినేటర్ శంకర్, గైడ్ టీచర్ బండారి శ్రీదేవి పిలుపునిచ్చారు. అనంతరం భూపాల్ పల్లి మైనార్టీ గురుకుల పాఠశాల నుండి మెయిన్ రోడ్డు వరకు ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించేలా ప్లే కార్డులు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ బదులు బట్ట సంచులు పేపర్ వంటి కాగితాలను ఉపయోగించడం వలన పర్యావరణానికి ఎలాంటి ఆటంకాలు ఉండవని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు.



## ముగిసిన పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

**వేద న్యూస్, మరిపెడ :**

ఈ నెల 14వ తేది నుండి 18వ తేది వరకు మరిపెడ మండలంలో గెజిటెడ్ హెడ్ మాస్టర్ అనంతరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు బయగాని రామ్మోహన్, గణిత ఉపాధ్యాయులు ఎన్.పవన్ కుమార్‌లతో కూడిన ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ టీం, పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో వేసే నిర్మాణాత్మక మూల్యాంకనం 20 మార్కుల అంతర్గత మార్కులను మరిపెడ మండలంలోని జడ్పిహెచ్ఎస్ గుండెపుడి, మహాత్మ జ్యోతిబాపూలే మరిపెడ, జడ్పీహెచ్ఎస్ తానంచెర్ల, భారతి విద్యా మందిర్ మరిపెడ, సెయింట్ అగస్టీన్ మరిపెడ, మాంటిసోరి మరిపెడ, మోడల్ స్కూల్ మరిపెడ, సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ మరిపెడ లో పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో 10వ తరగతుల్లో నిర్మాణాత్మక మూల్యాంకనంలో 20 మార్కులను వేసే విషయంలో ఉపాధ్యాయ బృందానికి తగిన సలహాలు, సూచనలు అందజేయడం జరిగింది. ఈ ఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమంలో మరిపెడ మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వేసవికాలంలో పలు చోట్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని మాతా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండలు దంచి కొడుతుండడంతో మంగళవారం వరంగల్ శాయంపేట చౌరస్తాలో మాతా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మజ్జిక పంపిణీ కార్యక్రమం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమములో సంస్థ ప్రతినిధులు పెండ్లి మధుకర్, అరుణ్, నవీన్, చందర్,రాం రెడ్డి, శివ, నరేష్, అజయ్, గణేష్ ,సాయి చందు,మరియు ఇతరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073